

అట్టహాసంగా..

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు

జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులు జరిగిన 21వ యానాం ప్రజా ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిసాయి. చివరిరోజు బుధవారం రాత్రి వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రత్యేక నృత్యాలు, ఫ్యాషన్ షోలతో అదరగొట్టారు.. ఆ దృశ్యాల్లో కొన్ని.. 6







కాకినాడలో జరిగిన యూటీఎఫ్ మహాసభల్లో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ నాయకత్వం

ముగిసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

కాకినాడలో నాలుగు రోజులపాటు జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారం ముగిసాయి. చివరిరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను త్వరలో చెల్లించనుందని వెల్లడించారు. కాగా యూటీఎఫ్ నూతన రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా సురేష్‌కుమార్, ప్రచురణాల కమిటీ చైర్మన్‌గా ఎం.హనుమంతరావు ఎన్నికయ్యారు. -7లో

'తెలుగు' వెలుగు

జీజీయూలో ఘనంగా ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు



రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరంలో ఉన్న గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ప్రారంభమైన రెండవ ప్రపంచ తెలుగు మహాసభల్లో నృత్య ప్రదర్శన




తెలుగు మహాసభలను ప్రారంభిస్తూ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు, పక్కన గరికిపాటి, యార్లగడ్డ, చైతన్యరాజు, చామర్తిరాజు తదితరులు.. (కింద) వెంకయ్య ఉపన్యాసం

- తరలివచ్చిన ప్రముఖులు
- తెలుగులోనే పాలన సాగాలి : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- వైభవంగా సాగిన తొలిరోజు పండుగ

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలనే సంకల్పంతో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జీజీయూ ప్రాంగణంలో ఆదికవి నన్నయ భట్టారక, రాజరాజ నరేంద్ర, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు పేరిట మూడు ప్రధాన వేదికలను ముస్తాబు చేసి తెలుగు భాషా సాహితీ ప్రక్రియలను నిర్వహించారు. ప్రధాన వేదిక చెంతనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన అయోధ్య బాలరాముడి ఆలయ నమూనా అందరినీ అబ్బురపరుస్తోంది. ఉదయం గణపతి ఆరాధన అనంతరం జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అంతా తెలుగులోనే సాగాలి. ఇక తెలుగు మాట్లాడేవాడికే ఓటేయాలి. తెలుగు భాష రానివాళ్లను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్‌వాళ్లు రాజమహేంద్రవరం వంటి పేర్లు పలకలేక రాజమండ్రిగా మార్చారు. ఇక రాజమహేంద్రవరం అనే పిలవాలి. ఇలా చాలాపేర్లు, పదాలు మార్చేసి, మనభాషను, సంస్కృతిని చెడగొట్టారు. వాటిని మనం సరిదిద్దుకోవాలన్నారు. ఆదికవి నన్నయ్య, ఆధునిక వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం వంటి వారెందరో తెలుగుభాషను సుసంపన్నం చేశారని గుర్తుచేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మహాసహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు, బృహత్ ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, ఆధ్యాత్మికవేత్త, శ్రీభారతీ తీర్థ పురస్కార గ్రహీత పి.బంగారయ్యశర్మ, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ప్రొఫెసర్ చామర్తి రాజు, కేటీ రామరాజు, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా సోలోమన్ డార్విన్, మాజీ ఎమ్మెల్సీ గోనె ప్రకాశరావు, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, ధూళిపాళ మహాదేవమణి, ప్రముఖ హాస్యనటుడు భద్రం, స్టార్టప్ కంపెనీ స్థాపించి వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న మృత్యుంజయేశ్వర్, గోమూత్రంతో కేన్సర్, డయాబెటిస్ వంటి వాటికి మందులు తయారు చేస్తున్న మహారాష్ట్రకు చెందిన కన్నయ్య కదంజి, న్యూక్లియర్ శాస్త్రవేత్త ఆర్.శ్యామసుందర్, సాహితీవేత్త ఎర్రాప్రగడ రామకృష్ణ, వేదుల శిరీష, మధుప్రోమ్రా, జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, జీజీయూ ప్రోఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, మాజీ ఎమ్మెల్సీ రవివర్మ తదితరులు విచ్చేశారు. ప్రముఖులు పీవీబీ సంజీవరాజు, సత్యనారాయణరాజు, కృష్ణంరాజు, సుబ్బరాజు, వీఎస్ఆర్ సోమయాజులు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.





తెలుగుభాష కోసం ఉద్యమించాలి : గరికిపాటి

ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమమే ఉండాలి. డిగ్రీ వరకు తెలుగు పాఠ్యాంశం ఉండాలి. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని మహాసహస్రావధాని, పద్మశ్రీ గరికిపాటి నరసింహరావు అన్నారు. తెలుగు మహాసభల్లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఫోన్ చేసి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని కోరిన సందర్భంలో ఈ డిమాండ్లు చెప్పానన్నారు. ఇవి జరగనప్పుడు భాషా సంఘం ఉన్నా ప్రయోజనం లేదన్నారు.



వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న ప్రముఖులు



నన్నయతోనే తెలుగు సాహిత్య విప్లవం : యార్లగడ్డ

పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ చైతన్యరాజు నాంది పలికిన ఈ కార్యక్రమం చారిత్రాత్మకం అవుతుందన్నారు. నన్నయ మహాభారతాన్ని ఆంధ్రీకరించడంతో ఈ ప్రాంతంలో తెలుగులో సాహిత్య విప్లవం మొదలైందన్నారు. హిందీ అష్టావధానం చేసిన ఈ నగరానికి చెందిన చేబోలు శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని గతంలో తయారు చేయించానని, దానిని ప్రతిష్ఠింపజేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చైతన్యరాజుకు విజ్ఞప్తిచేశారు.



తెలుగుపై ప్రేమతోనే నిర్వహణ : చైతన్యరాజు

తెలుగుభాష పట్ల అపారమైన ప్రేమ ఉన్నందునే ప్రపంచ మహాసభలను ఇక్కడ నిర్వహిస్తున్నామని జీజీయూ కులపతి చైతన్యరాజు అన్నారు. గతేడాది జనవరిలో మూడు రోజులపాటు మహాసభలు జరిపించి, ఐదు రోజులపాటు శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు జోడించిన విషయాన్ని గుర్తుచేశారు. కృత్రిమ మేథ, సాంకేతికతతో అయోధ్య రాముని నమూనా ఆలయం ఏర్పాటు చేశామన్నారు.

పిఠాపురంలో రేపు..

పవన్ పర్యటన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

- సంక్రాంతి సంబరాల్లో పాల్గొననున్న డిప్యూటీ సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 12,500 మినీ గోకులాలకు కుమారపురం నుంచి ప్రారంభోత్సవం

పిఠాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన అధికారికంగా ఖరారైంది. పిఠాపురం పట్టణంలో జరిగే సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడంతోపాటు వివిధ శాఖలు ఏర్పాటు చేసే స్టాల్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. పిఠాపురం మండలంలోని కుమారపురం నుంచి రాష్ట్రవ్యాప్తంగా గోకులాలను ప్రారంభించనున్నారు.

ఏడీబీ రోడ్డు మీదుగానే రాక..

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 10న ఉదయం 9.10గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన రాజానగరం, రంగంపేట, పెద్దాపురం, సామర్లకోట ఏడీబీ రోడ్డు మీదుగా 11.45గంటలకు పిఠాపురం మండలం కుమారపురం చేరుకుంటారు. ఇక్కడ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులాన్ని ప్రారంభిస్తారు. ఇక్కడినుంచే రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 12,500 మినీగోకులాలకు ప్రారంభోత్సవం జరుగుతుంది. అక్కడినుంచి 12.15గంటలకు బయలుదేరి 12.25గంటలకు పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండ్ మునిసిపల్ ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. ఇక్కడ జరిగే సంక్రాంతి సంబరాల్లో పాలుపంచుకుంటారు. అక్కడి వివిధ ప్రభుత్వశాఖలు ఏర్పాటు చేసే స్టాల్స్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకూ అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఇక్కడినుంచే నూతనంగా నిర్మించిన గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంతోపాటు పలు అభివృద్ధి పనులను వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. అనంతరం అక్కడినుంచి బయలుదేరి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసానికి 2.30గంటలకు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 3.30గంటలకు బయలుదేరి సాయంత్రం 5గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్లి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి వెళ్తారు.

కలెక్టర్, ఎస్పీ సమీక్ష

పవన్ పర్యటన అధికారికంగా ఖరారు కావడంతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ రాహుల్‌మీనా ఏర్పాట్లపై పరిశీలన జరిపారు. కుడా చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిమర్రెడ్డి శ్రీనివాసరావులతో కలిసి సంక్రాంతి సంబరాలు, బహిరంగ సభ జరిగే పిఠాపురంలోని పాతబస్టాండు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందుకు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు ఉండాలని, బారికేడింగ్ చేయాలని ఆదేశించారు. స్టాల్స్ ఏర్పాటుతోపాటు వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. వివిధ ప్రభుత్వశాఖల స్టాల్స్ ఏర్పాటుపై సూచనలు ఇచ్చారు. ఎటువంటి లోటుపాట్లకు అవకాశం ఇవ్వవద్దని స్పష్టం చేశారు. వీరి వెంట ట్రైనీ కలెక్టర్ భావన, జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు, సీఐ శ్రీనివాస్, తహసీల్దారు గోపాలకృష్ణ ఉన్నారు.

పట్టణాల్లో 20 లోపు పన్నులు చెల్లించాలి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో రెడ్ నోటీస్ జారీచేసిన పన్నుదారులు ఈనెల 20నాటి కి పన్ను చెల్లించకపోతే ఆయాగృహాలకుఉన్న తాగునీరు కనెక్షన్లు తొలగించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీ ప్రాంతాలు పరిశుభ్ర వాతావరణం ఉండేలా నిరంతరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇంటింటా తడి పొడి చెత్తల సేకరణ ప్రక్రియను మరింత మెరుగ్గా చేపట్టాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో నిర్దేశించిన గడువు లోపు పన్నుల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎప్పటి నుంచో పేరుకుపోయిన లెగసీ వేస్ట్‌ను వెంటనే తొలగించాలన్నారు. కుక్కలు వృద్ధి చెందకుండా సంతాన ఉత్పత్తిని నిరోధించేందుకు అవసరమైన ఆపరేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన, ఎంహెచ్వో పృథ్వీచరణ్, కమిషనర్లు పాల్గొన్నారు.

పట్టించుకోకపోతే ఆస్తులు వెనక్కే..

- తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఇదే గతి
- పిల్లలకు రాసిన ఆస్తిని వెనక్కి తీసుకోవచ్చు
- హక్కులు రద్దు చేసే అధికారం ఆర్డీవోకి
- ఆదేశాలు జారీచేసిన రిజిస్ట్రేషన్ల శాఖ



పెద్దాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తల్లిందండ్రుల హక్కులను కాపాడేందుకు సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. తల్లిదండ్రుల నుంచి ఆస్తి రాసిపుచ్చుకుని వారిని పట్టించుకోని వారసులపై చర్యలు తీసుకోనుంది. వారు సరిగ్గా చూడడం లేదని భావించిన తల్లిదండ్రులు ఆర్డీవోకు పిటిషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. తల్లిదండ్రులను పట్టించుకోని పక్షంలో వారిచ్చిన ఆస్తులపై హక్కులు కల్పించేలా నిర్ణయించింది.

పిల్లలకు తల్లిందండ్రులు గిఫ్ట్‌డీడ్, సెటిల్‌మెంట్ కింద ఆస్తులు ఇస్తున్నారు. తర్వాత తల్లిదండ్రులను పిల్లలు వదిలేస్తున్న పలు ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇకపై ఇలాంటి రిజిస్ట్రేషన్లకు సెటిల్‌మెంట్లు, గిఫ్ట్‌డీడ్లు రద్దు చేశారు. తల్లిదండ్రులు, పిల్లలు ఇద్దరూ వస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. తల్లిదండ్రులను జాగ్రత్తగా ఉంచడంకోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పిల్లల నిర్లక్ష్యంపై తమ దృష్టికి వచ్చిన పలు కేసులను విచారించి నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఆర్డీవోకి అప్పజెప్పారు. విచారణ తర్వాత ఆస్తిపై పిల్లల హక్కును రద్దు చేసి తల్లిదండ్రులకు అప్పజెప్పే అధికారం ఆర్డీవోకు ఉంటుంది. ఆయన ఆదేశాలను రిజిస్ట్రేషన్లశాఖ తమ కార్యాలయాల్లోని సాఫ్ట్‌వేర్ రికార్డుల్లోనూ పొందుపరచాలి. ఆర్డీవో ఆదేశాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ హక్కులు మార్చాల్సి ఉంటుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్లశాఖ ఆదేశాలిచ్చింది.

వృద్ధాప్యంలో అవ్వా, నాన్నల బాగోగులు చూసుకుంటామని హామీ ఇచ్చి వారినుంచి ఆస్తులు పొందిన పిల్లలు తర్వాత మాట తప్పుతున్న సందర్భాలున్నాయి. నిరాదరణకు గురయ్యే తల్లిదండ్రులు తమ వారసులకు ఇచ్చిన ఆస్తులను రద్దు చేసుకునే హక్కును తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, పోషణచట్టం 2007 ఇప్పటికే కల్పిస్తోంది. పిల్లలకు బదిలీ చేసిన ఆస్తులపై తల్లిదండ్రులు తిరిగి యాజమాన్య హక్కులు పొందేలా ఆదేశించే అధికారం ట్రిబ్యునళ్లకు ఉంది. ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. తల్లిదండ్రులను నిరాదరిస్తే అవతలి వ్యక్తులు ఎవరైనా శిక్షార్హులే అవుతారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు మంచి వాతావరణంలో గడిపేలా చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలదే. కొంతమంది తల్లిదండ్రులు భారం అని దూరం పెట్టాలని చూస్తుంటారు. వారు కనిపెంచితేనే ఇంతటిస్థాయిలో ఉన్నామనే విషయాన్ని మరిచిపోకూడదు.

ప్రభుత్వ నిర్ణయంతో కుటుంబాల్లో మార్పు

తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుకోసం తమ జీవితాలను త్యాగం చేస్తుంటారు. కొందరు వారసులు తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటేస్తుండగా, మరికొందరు వృద్ధాశ్రమాలకు పంపుతున్నారు. ఈ తరహా పరిస్థితులను నియంత్రించడంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం కీలకపాత్ర పోషిస్తుంది. తల్లిదండ్రుల హక్కులను కాపాడడంలో ఈచర్య సమర్థవంతంగా పనిచేయడం ద్వారా ఆ కుటుంబాల్లో మార్పు తీసుకురావాలి.

-బి.సూర్యనారాయణమూర్తి, ట్రిబ్యునల్ కాన్సిలియేషన్ ఆఫీసర్, పెద్దాపురం

రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాకు మూడు స్థానాలు: డీఈవో రమేష్

కాకినాడరూరల్/తొండంగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా మూడు స్థానాలు సాధించినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. బెండపూడి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బలరామ శివ తయారుచేసిన సూర్యుడిని అనుసరించే సోలార్ పలకల ప్రాజెక్టు వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానంలో నిలవగా దీనికి సత్యశ్రీ అనే భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు గైడ్‌గా వ్యవహరించారన్నారు. ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయిబాబు తయారుచేసిన మల్టీపర్పస్ మిషన్ ప్రాజెక్టు వ్యక్తిగతవిభాగంలో ప్రథమస్థానంలో నిలిచి బహుమతి సాధించగా దీనికి ఆకుల శివకుమార్ గైడ్‌గా వ్యవహరించారు. ఉపాధ్యాయ ప్రదర్శన విభాగంలో గణిత అవధాని రవిశంకర్ తయారుచేసిన ఆల్‌రౌండర్ 90డిగ్రీస్ ప్రాజెక్టు దక్షిణ భారత విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైందన్నారు. ఈనెల 20 నుంచి 24 వరకూ పుదుచ్చేరిలో జరిగే దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను,ఉపాధ్యాయులను డీఈవో రమేష్,ఆర్జేడీ నాగమణి, ఏపీసీ వేణుగోపాలరావు, సైన్స్ అధికారి శ్రీనివాస్ అభినందించారు.



ప్రథమస్థానాల్లో నిలిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

తెలుగు వైభవం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖుల విగ్రహాలు



బాలరాముని నమూనా ఆలయం వద్ద మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పూజలు

ఘనంగా తెలుగు మహాసభల తొలిరోజు పండుగ



ప్రముఖ కవి జొన్నవిత్తులకు సన్మానం

తెలుగు వెలుగైంది..ఆ వెలుగు ప్రపంచ తెలుగు మహాసభలకు వచ్చిన భాషాభిమానుల కళ్లల్లో కనిపించింది..రాజమహేంద్రవరం కేంద్రంగా గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తేనె పలుకుల సంపద అయిన అమ్మభాషకు అందలం దక్కింది.. ఆ మధుర క్షణాల్లో తనువు అణువణువు పులకించింది..







ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో చేసిన పలు ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ప్రధానంగా భువన విజయం, నెమలి నృత్య ప్రదర్శన, జానపద నృత్య ప్రదర్శన, కవి సమ్మేళనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.




స్టాల్స్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

బాలరాముని ఆలయం

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ రాజమహేంద్రవరంలో ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభల వేడుకల్లో ప్రధాన వేదికను ఆనుకుని తీర్చిదిద్దిన అయోధ్య బాలరాముని నమూనా ఆలయం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. సాంకేతికతను వినియోగించి అయోధ్య బాలరాముని ఆలయం తీర్చిదిద్దినట్లు జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్ వెల్లడించారు. భక్తులు కోరిన విధంగా ఈ నమూనా ఆలయం తీర్చిదిద్దామన్నారు. అలాగే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అబ్దుల్ కలాం అవతార్(డిజిటల్) స్ర్కీన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడకు వచ్చి ఎవరైనా గౌరవప్రదమైన ప్రశ్నలు అడిగితే సరైన సమాధానాలు వారి నుంచి వస్తాయని చెప్పారు.

'నిలువెత్తు' సంపద





ముఖ్య అతిథులతో సభా వేదిక



ముగింపు సభలో మాట్లాడుతున్న లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్

యానాం ప్రజా ఉత్సవాలు సంక్రాంతిని తలపిస్తున్నాయి

● పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్

యానాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యానాం ప్రజా ఉత్సవాలు సంక్రాంతిని తలపిస్తున్నాయని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ అన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మ ల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్త నిర్వహణలో జరిగిన యానాం ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శనల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగులో మాట్లాడి ఆశ్చర్యపరిచారు. 'తెలుగు భాష చాలా తీయనిది. 1965లో మద్రాసులో చదువుకున్న సమయంలో నాకు ఎక్కువ మంది స్నేహితులు గుంటూరు, గూడూరు, నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ వారే ఉండేవారు. వారితో ఎక్కువగా సాన్నిహిత్యం ఉండేది. వారితో కలిసి తెలుగు సినిమాలు చూసేవాడిని' అన్నారు. మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇంతమంది ప్రజలు ఒక్కచోట చేరినందుకు, ప్రజా ఉత్సవాలు, ఫలపుష్ప ప్రదర్శనల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నూతన సంవత్సరారంభంలో గొప్ప సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగం కావడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు. పవిత్రమైన గోదావరి బంగాళాఖాతంలో కలిసే ఈ అందమైన ప్రాంతం యానాం. దేశమంతటా... ముఖ్యంగా పుదుచ్చేరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రధాని మోడీ సంకల్పిస్తున్నారన్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ముందుగానే పండుగ వాతావరణం వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నారన్నారు. ముఖ్యంగా అందరి సమష్టి కృషితో యానాం పర్యాటకపరంగా మరింత అభివృద్ధి చేందేందుకు ఎక్కువగా అవకాశాలున్నాయి. యానాం అభివృద్ధికి తగిన సహకారం అందజేస్తామన్నారు. అనంతరం పర్యాటక శాఖ మంత్రి లక్ష్మీనారాయణ, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడారు. గవర్నర్‌కు ఢిల్లీ ప్రతినిధి మల్లాడితో పాటు మల్లాడి అభిమాన సంఘం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పౌర సన్మానం చేశారు. యానాంలో పలు అభివృద్ధి పనులను గవర్నర్ కైలాష్‌నాథన్ ప్రారంభించారు.



లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి మల్లాడి







ప్రజా ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆకట్టుకున్న లేజర్ షో

అట్టహాసంగా ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు

యానాం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులు జరిగిన 21వ యానాం ప్రజా ఉత్సవాలు బుధవారం రాత్రి అట్టహాసంగా ముగిసాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ ఉత్సవాలు నిర్వహించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల ప్రత్యేక నృత్యాలు, ఫ్యాషన్ షో అలరించాయి. చివరి రోజైన బుధవారం విశాఖపట్నానికి చెందిన విక్టరీ ఈవెంట్ మేకర్స్ మేడిది విక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైకా, లేజర్ షో, ఫైర్‌షో, ముంబయి డ్యాన్స్, కోల్‌కత్తా డ్యాన్స్, అంథేరా డ్యాన్స్, చెన్నయ్‌కు చెందిన సంపత్ జంగ్లీగ్ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బృందం సినీ ఆర్కెస్ట్రా నిర్వహించారు. ప్రముఖ గాయకులు ఆలపించిన సినీ గీతాలు ఆహుతులను అలరించాయి. అనంతరం నృత్య పోటీల్లో గెలుపొందిన వారితో ప్రదర్శనలు ఇప్పించాయి. టీవీ, ఫిలిం ఆర్కెస్ట్రా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాజశేఖరన్ నేతృత్వంలో సీఐ షణ్ముగం బందోబస్తు చర్యలు చేపట్టారు.







ప్రముఖ గాయకుడు శ్రీకృష్ణ బృందం సినీ సంగీత విభావరి

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

ఏడీబీ రహదారి పనుల ప్రక్రియపై సమగ్ర వివరాలు ఇవ్వండి

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏడీబీ నిధులతో చేపట్టిన రహదారి పనులను త్వరితగతిన పూర్తిచేసే క్రమంలో వాటికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్‌పరంగా సేకరణ ప్రక్రియపై సమగ్ర వివరాలు తనకు అందజేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెవెన్యూ అధికారులతో ఏడీబీ రోడ్డు పనులపై బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ-రాజానగరం వరకు నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు మార్గం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ క్రమంలో రహదారి నిర్మాణ పనులకు ఆటకం లేకుండా చూడాలన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రాజెక్ట్ అధికారిగా జేసీ, భూసేకరణ అధికారిగా రాజమహేంద్రవరం ఆర్డీవో, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా రాష్ట్ర హైవే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రహదారి విస్తరణకు మొత్తం 72.16 ఎకరాల భూమి సేకరణ చేపట్టాల్సిఉంటుందన్నారు.ఇందులో 57.69 ఎకరాలు ప్రైవేట్ భూమి సేకరించగాతూర్పుగోదావరి జిల్లాలో 34,11 ఎకరాల భూమి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీకి అప్పగించామన్నారు. ఆక్రమణలకు పాల్పడినవారిని ఖాళీ చేయించే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ చిన్నరాముడు, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఈఈ శ్రీకాంత్, డీఈ రాజానగరం, రంగంపేట తహసీల్దార్ లావణ్య, కె.అనసూయ పాల్గొన్నారు.



రంగంపేట మండలం ఎస్టీరాజాపురంలో ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన

రంగంపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ-రాజానగరం ప్రధాన రహదారి మార్గంలో ఏపీరహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడీబీ నిధులతో చేపట్టిన పనులను పూర్తి చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజానగరం, రంగంపేట మండలాల పరిధిలో ఏడీబీ రోడ్ రహదారి పనులను, భూసేకరణ విషయంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు జేసీ చిన్నరాముడుతో కలిసి బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.

నష్టపరిహారం ఇప్పించి నిర్మించండి

జేసీ చినరాముడు రంగంపేట, పెదరాయవరం తదితర గ్రామాలకు చెందిన ప్రాంతాల్లో రహదారి మార్గాన్ని పరిశీలించారు. రంగంపేట సెంటర్‌లోని షాపుల యజమానులతో మాట్లాడారు. షాపులను స్వచ్ఛంధంగా ఖాళీచేయాలని చెప్పగా రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇల్లు, షాపులు పోతున్నందున తమకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని, ఇల్లు కోల్పోతున్నవారికి వేరేచోట ఇళ్ల స్థలాలు ఇస్తామన్నా ఇవ్వలేదని, షాపుల కోల్పోతున్నందున తమ కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వస్తుందన్నారు. దానికి స్పందించిన జేసీ త్వరలో భూమి కోల్పోతున్న రైతులకు, షాపుల యజమానులకు సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్‌డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్, రాజానగరం, రంగంపేట తహశీల్దార్‌లు లావణ్య, కోసు అనసూయ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం

● కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రోడ్ల అభివృద్ధి ● కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ● ముగిసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు



సభలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు త్వరలో చెల్లించనుందని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ పీఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో బుధవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ముగింపు కార్యక్రమం జరిగింది. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షే మమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రోడ్లు అబివృద్ధి చెందుతున్నాయన్నారు. జలజీవన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.21వేలకోట్లు ఏపీకి మంజూరు చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు ధ్వంసం అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో భారీఎత్తున పరిశ్రమలు రానున్నాయన్నారు. ఎన్డీఏ అధికారంలోకి రావడంలో యూటీఎఫ్ ఉపాధ్యాయుల పాత్ర కూడా ఉందన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.

సభలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి యూటీఎఫ్ నిరంతరం ఉపాధ్యాయుల కోసం పనిచేస్తుందన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడుతూ 140ఏళ్ల చరిత్ర కల్గిన రాష్ట్రంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ కళాశాల ఇదేనని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు 67 దేశాల్లో వివిధ ఉన్నతస్థాయిలో పనిచేస్తున్నారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్, మోడల్‌స్కూల్, పంచాయతీరాజ్, కస్తూరిబా పాఠశాలలు ఇలా అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు యూటీఎఫ్ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం యూటీఎఫ్ కార్యాచరణ రూపొందించిందన్నారు. ఫిబ్రవరి 17వతేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. దీని కోసం తొలుత ఫిబ్రవరి 2న విజయవాడలో సదస్సు నిర్వహిస్తామని తర్వాత ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, ఉత్తర రాయలసీమ, దక్షిణ రాయలసీమల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో ఉండాలని.. అవసరమైతే ఎల్‌కేజీ, యూకేజీలు కూడా వీటిలో నిర్వహించాలని తీర్మానించారు. ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలో జరగాలని తీర్మానించారు. హైస్కూల్‌లో రెండు మీడియంల్లో బోధన కొనసాగాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్య దర్శి గిరిధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం, సాంకేతిక స్పృహ పెంచాలని ఆయన కోరారు.



వేదికపై నేనొక కవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

పలు తీర్మానాలు

ముగింపు సభలో పలు తీర్మానాలు చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, 117 జీవో రద్దు చేయాలని తీర్మానించారు. ప్రాథమిక పాఠశాల వ్యవస్థ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పునరుద్ధరించాలని, హైస్కూల్‌లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంల్లో కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు కల్పించాలి. 12వ నూతన వేతన సవరణ సంఘం నియమించాలి. మధ్యంతర భృతి వెంటనే చెల్లించాలని తీర్మానించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. ఉపాధ్యాయులపై ఉన్న యాప్స్ భారం తగ్గించాలి. ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యను బలోపేతానికి చర్యలు తీసుకోవాలి. జాతీయ నూతన విద్యావిధానం 2020ను రద్దు చేయాలి. కామన్ సర్వీస్ రూల్స్ సాధన, జూనియర్ లెక్చరర్స్ పదోన్నతులు, మున్సిపల్ టీచర్లు, ట్రైబుల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించారు. ఇలా మొత్తంగా 15 తీర్మానాలు చేశారు. సభ ఏకాగ్రీవంగా వాటిని ఆమోదించింది. అనంతరం యూటీఎఫ్ సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు అందజేశారు.

నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు

నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గానికి ఎమ్మెల్సీలు గోపిమూర్తి, కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేయాలని ఆకాంక్షించారు. మహాసభలు విజయవంతంఅవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తిలు ధన్యవాదాలు తెలిపారు. అన్ని కార్యక్రమాలు విజయవంతానికి కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



వేదికపై పాటలు పాడుతున్న ఉపాధ్యాయ బృందం

మహా చైతన్యం నింపాయి



కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు 20వేల మంది ఉపాధ్యాయుల్లో మహా చైతన్యం నింపాయి. ఉపాధ్యాయులందరూ ఒకే చోట చేరి విజ్ఞానం పంచుకున్నాం. ఇలాంటి సభలు నిర్వహించడం వల్ల విద్యావికాసం జరుగుతుంది. ఇక్కడే 25ఏళ్ల కిత్రం రజతోత్సవాలు, ఇప్పుడు స్వర్ణోత్సవాలు జరగడం విశేషం.

ఐ.ప్రసాద్‌రావు, ఉపాధ్యాయుడు, కాకినాడ జిల్లా

విజ్ఞానం వెల్లి విరిసింది



స్వర్ణోత్సవాల్లో భాగంగా జరిగిన విద్యా వైజ్ఞానిక సదస్సుల వల్ల ఉపాధ్యాయుల్లో విజ్ఞానం వెల్లి విరిసింది. కొత్త స్ఫూర్తిని ఇచ్చింది. జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రఖ్యాతగాంచిన విద్యావేత్తలు, మేధావులు వచ్చి సరికొత్త విషయాలు తెలియజేశారు. సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లకు అనుగుణంగా విద్యార్థులకు బోధన ఎలా చేయాలో నేర్పించారు.

సీహెచ్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, తూర్పుగోదావరిజిల్లా

మహిళా వికాసానికి నాంది



యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళా సాహితీ సదస్సు మహిళల వికాసానికి నాంది పలికింది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో మహిళా ఉద్యమ నేతలు వివరించారు. మహిళా రచనలు, మహిళల సాహిత్యం ఎంతో ఆకట్టుకుంది.

బి.చంద్రకళ, ఉపాధ్యాయురాలు, కోనసీమజిల్లా

ఫిబ్రవరి 1 నుంచి

భూముల మార్కెట్ విలువ పెంపు



ముమ్మిడివరంలో రికార్డులు పరిశీలిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ

ముమ్మిడివరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ విలువ పెంపునకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్‌లకు జూమ్ మీటింగ్ నిర్వహించి దశా దిశా నిర్దేశించినట్టు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ బి.శివరామ్ తెలిపారు. ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ భూముల మార్కెట్ విలువ పెంపు విషయంపై తహశీల్దార్లు, వీఆర్వోలు, నగర పంచాయతీ అధికారులు, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లతో చర్చించి రీ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించామన్నారు. వారికి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామన్నారు. ఈనెల 10వ తేదీ వరకు రీ వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. జనవరి 17న ఫైనల్‌గా అప్రూవల్ తీసుకోవడం జరుగుతుందని, కమిటీ చైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్, సభ్యునిగా మున్సిపల్ కమిషనర్, సబ్‌రిజిస్టర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. 18న డేటా ఎంట్రీ జరుగుతుందని, అభ్యంతరాల స్వీకరణ కోసం ప్రజల ముందు ఉంచడం జరుగుతుందన్నారు. 24న అభ్యంతరాలు స్వీకరిస్తామని, 25న ఫైనల్ వాల్యూస్ కమిటీ అప్రూవల్ చేస్తుందన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెంచిన నూతన రేట్లు అమలులోకి వస్తాయని ఆయన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ ఎం.సుధాకరరావు, సిబ్బంది ఉన్నారు.

కత్తితో పదో తరగతి విద్యార్థి హల్‌చల్

ఇంటర్ విద్యార్థిని

చంపుతానని బెదిరింపు

గొల్లప్రోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని చంపుతానని బెదిరించడమే గాక, కత్తితో హల్‌చల్ చేసిన పదో తరగతి విద్యార్థిపై గొల్లప్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా చెందుర్తి గ్రామానికి చెందిన బాలుడు గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బాలిక గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆమె గురించి పదో తరగతి విద్యార్థి తప్పుగా ప్రచారం చేయడంపై గొల్లప్రోలు బాలికోన్నత పాఠశాల వద్దకు వచ్చిన బాలుడిని విద్యార్థిని ప్రశ్నించింది. దీంతో ఆగ్రహించిన పదో తరగతి విద్యార్థి ఆమెపై దాడికి ప్రయత్నించాడు. స్థానికులు అడ్డుకోవడంతో సంచిలో నుంచి కత్తిని తీసి బెదిరించాడు. విద్యార్థినిని చంపేస్తానంటూ వీరంగం చేశాడు. దీంతో స్థానికులు బాలుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడ పుస్తకాల బ్యాగు, కత్తి వదిలివేసి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

12,19 తేదీల్లో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

పిఠాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12, 19వ తేదీల్లో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు జరగనున్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 12న ఇండియన్ రౌండ్ విభాగంలో జూనియర్స్ బాలబాలికలకు ఉదయం 8గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. జూనియర్స్ రికర్వ్ బాయ్స్ అండ్ గరల్స్ విభాగంలో పోటీలు ఈనెల 19న రాజమహేంద్రవరం మోడల్ కాలనీ ఆర్చరీ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతాయని చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబరిచినవారిని రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఆర్చరీ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆర్చర్స్ ఆధార్‌కార్డు, పుట్టిన తేది ధృవీకరణ పత్రం జిరాక్స్ తీసుకురావాలని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలిచినవారు 2004 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ 9989001162లో సంప్రదించాలని సూచించారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు 8వ రోజైన బుధవారం కూడా కొనసాగాయి. ఈ పరీక్షల్లో(పీఎంటీ, పీఈటీ) మొత్తం 350మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 260మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు బుధవారం ఈ దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వీటిని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.

కె.పెదపూడిలో ఉద్రిక్త పరిస్థితులు

సంక్రాంతి ఫ్లెక్సీ, రంగా విగ్రహం

ఏర్పాటుతో వివాదం

భారీగా పోలీసుల మోహరింపు

పోలీస్ పికెట్ ఏర్పాటు



రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం



స్థానికులతో చర్చిస్తున్న అధికారులు

అంబాజీపేట, జనవరి8 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీల ఏర్పాటు... రంగా విగ్రహం ఆవిష్కరణతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.పెదపూడి గాంధీ సెంటర్లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వారం రోజుల కిత్రం సంక్రాంతి శుభాకాంక్షలు పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీని పక్కనే కాపు సామాజిక వర్గానికి చెందిన యువత రెండు రోజుల కిత్రం మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ యూత్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ప్రాంతంలో అక్కడ సంక్రాంతి సందర్భంగా భోగి మంటలు వేసే స్థలం కావడంతో వివాదం ముదిరింది. దీంతో మంగళవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం పక్కన కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని కాపు సామాజికవర్గానికి చెందిన వారు ఏర్పాటు చేశారు. దీంతో బుధవారం రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, పోలీసులు రంగప్రవేశం చేసి రంగా విగ్రహం అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారని ఫిర్యాదు చేశారని ఉద్రిక్తత పరిస్థితుల నడుమ తొలగించారు. అడ్డువచ్చిన కాపు సామాజిక వర్గీయులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ విషయం మండలవ్యాప్తంగా తెలియడంతో కాపు సామాజిక వర్గీయులు కె.పెదపూడికి చేరుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్ ఐలు శివకృష్ణ, ఏ.చైతన్యకుమార్, సురేంద్ర పోలీస్ బలగాలతో అక్కడికి చేరుకున్నారు. అలాగే ఎంపీడీవో జీవీ సరోవరరావు అక్కడికి చేరుకున్నారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాపు సామాజికవర్గీయులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, స్థానికులు చిక్కం ఏసు, పల్లంరాజు, రాయపురెడ్డి సత్యనారాయణతో సీఐ విద్యాసాగర్, ఎంపీడీవో సరోవరరావు చర్చించారు. కె.పెదపూడి సెంటర్‌లో అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేశారని, వాటిని కూడా తొలగించాలని అప్పుడు రంగా విగ్రహాన్ని తొలగిస్తామని ఆగ్రహించారు. ఓ దశలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిని వారించారు. పరిస్థితి మారడంతో ఎంపీడీవో మాట్లాడుతూ త్వరలో శాంతి కమిటీని ఏర్పాటు చేసి ఇక్కడ సమస్యలు, పరిస్థితులు చర్చిద్దామని సూచించారు. అప్పటి వరకు ఏ విగ్రహాలు తొలగించవద్దని, ఎలా ఉందో అలానే ఉంచాలని సూచించారు. దీంతో విషయం సద్దుమణిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కె.పెదపూడి సెంటర్‌లో పికెట్ ఏర్పాటు చేస్తామని సీఐ విద్యాసాగర్ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అభిమానుల కుటుంబాలకు

సినీ హీరో రామ్‌చరణ్ రూ.10 లక్షల సాయం



మణికంఠ తల్లికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు



చరణ్ తండ్రి అప్పారావుకు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన ఇద్దరు అభిమానుల కుటుంబ సభ్యులకు సినీ హీరో రామ్‌చరణ్ రూ.10లక్షలు ప్రతినిధుల ద్వారా అందజేశారు. బుధవారం కాకినాడ రాజేశ్వరినగర్, అశోక్‌నగర్‌లో గల మృతులు అరవ మణికంఠ, తోకాడ చరణ్‌ల ఇళ్లకు రామ్‌చరణ్ ఆదేశాల మేరకు చిరంజీవి యువత ప్రతినిధులు వెళ్లి చెరో రూ.5 లక్షల వంతున రూ.10 లక్షల చెక్కును మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. మణికంఠ, చరణ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిరంజీవి యువత ప్రతినిధులు మాట్లాడుతూ చరణ్ అభిమానులు ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం ఎంతో బాధకరమన్నారు. రూ.10 లక్షలను రామ్‌చరణ్ ఆర్టీజీఎస్ ద్వారా నగదును బాధిత కుటుంబ సభ్యులకు పంపించారని, నగదు లావాదేవీల వివరాలను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత ప్రతినిధులు గరగా రామ్, విజ్జన శివ, చింతకాయల చిన్ని, కె.బాబీ, వై.బాబీ తదితరులు పాల్గొన్నారు.

160 కోడి కత్తులు స్వాధీనం

ఏలేశ్వరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం సర్కిల్ పరిధిలో 160 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌డీపీవో శ్రీహరిరాజు తెలిపారు. ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాలతో ఎస్ఐ రామలింగేశ్వరరావుకు వచ్చిన సమాచారం ఆధారంగా దిబ్బలపాలెంలో చర్యలు చేపట్టామన్నారు. ఎదురాడ మల్లేశ్వరరావు అనే వ్యక్తి నుంచి కోడి పందాలకు ఉపయోగించే 160 కత్తులను స్వాధీనపర్చుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. సంక్రాంతి పేరుతో అనధికారికంగా జూదాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. కోడి పందేలు నిర్వహించేవారిని, పాత కేసుల్లో నిందితుల్ని బైండోవర్ చేస్తామన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

మోతుగూడెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం డొంకరాయిలో గంజాయి లిక్విడ్‌తో పాటు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి గ్రామ శివారున శ్రీవనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన రాహుల్ చంద్ర కాప్రి అనుమానాస్పదంగా ఉండడంతో పట్టుకున్నారు. మధ్యవర్తులు, లక్కవరం ఎఫ్ఆర్‌ఓ వెంకట నానాజీ సమక్షంలో పరిశీలించగా అతడి వద్ద రూ.5లక్షలు విలువ చేసే 2 కిలోల లిక్విడ్ గంజాయి ఉన్నట్టు గుర్తించి అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

భర్త మృతి తట్టుకోలేక..

బ్రెయిన్ స్ట్రోక్‌తో భార్య మృతి



సూర్యప్రకాశరావు, భాగ్యలక్ష్మి (ఫైల్)

కె.గంగవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భర్త అకాల మరణం జీర్ణించుకోలేక భార్య మృతిచెందిన సంఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలో జరిగింది. నాళం సూర్యప్రకాశరావు(సూరిబాబు)(54), సూర్యవెంకట భాగ్యలక్ష్మి (బంగారమ్మ)(48) భార్యాభర్తలు. వారు అముజూరు గ్రామంలో నివాసం ఉంటున్నారు. పాణింగపల్లి గ్రామంలో కిరాణా షాపు నిర్వహించుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సూరిబాబు ఈనెల 1న అనారోగ్యంతో మృతిచెందాడు. భర్త మృతితో తీవ్ర మనోవేదనకు గురైన బంగారమ్మ అయన లేని జీవితాన్ని జీర్ణించుకోలేకపోయింది. దుఃఖంతో కుంగిపోయింది. మంగళవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందింది. భార్యాభర్తలు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

కుమార్తె మరణవార్త విని...

తండ్రికి గుండెపోటు



గంగాభవానీ (ఫైల్)

కొత్తపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుమార్తె మరణ వార్త తెలిసి తండ్రి గుండెపోటుకు గురైన సంఘటన కాకినాడ జిల్లా ఉప్పాడలో జరిగింది. గ్రామస్థులు సమాచారం మేరకు... స్థానిక రామిశెట్టిపేటకు చెందిన రామిశెట్టి గంగాభవానీ(18) కృష్ణాజిల్లా తాడిగడప శ్రీ చైతన్యకాళాశాలలో నీట్ కోచింగ్ తీసుకుంటుంది. బుధవారం భవానీ గుండెపోటుతో మరణించిందని శ్రీచైతన్యకళాశాల నుంచి వేమన్నకు సమాచారం అందింది. అతడికి విపరీతమైన గుండెనొప్పి రావడంతో స్థానికంగా చికిత్స చేయించి కాకినాడకు తరలించారు.

రేపు వాడపల్లిలో ఉత్తర ద్వార దర్శనం



వాడపల్లి వెంకన్న ఆలయంలో ఏర్పాట్ల దృశ్యం

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఆత్రేయపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు ఈ నెల 10 శుక్రవారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు వైకుంఠ ద్వారా స్వామిని దర్శించుకునే ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయాన్ని ఫలపుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సప్త ద్వారాల గుండా శ్రీమహావిష్ణుమూర్తి శేషపాన్పుపై భక్తులకు అభయ హస్తం అందించనున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శన ప్రవేశం కల్పిస్తూ ఏర్పాట్లు చేపడుతున్నారు. గరుడ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించనున్నారు.

ప్రతిచోట సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలి

అన్నవరం దేవస్థానం ఈవో



అన్నదాన విభాగంలో భక్తుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి సత్యదేవుడి సన్నిధికి వచ్చే భక్తులు ఎక్కడా ఇబ్బందిపడకుండా అన్నవరం విచ్చేసినప్పటి నుంచి తిరుగు ప్రయాణమయ్యే వరకు ప్రతిచోట సైన్‌బోర్డులు ఏర్పాటుచేయాలని ఈవో సుబ్బారావు ఆదేశించారు. వాటి ద్వారా భక్తులు ఎవ్వరినీ సంప్రదించడకుండా నేరుగా వ్రతాలు, దర్శనాలు పూర్తిచేసుకోవచ్చన్నారు. బుధవారం రత్నగిరిపై పీఆర్వో, రిసెప్షన్, వ్రతమండపాలు, అన్నదాన విభాగాలను ఆయన పరిశీలించారు. యాగశాల వద్ద ఏర్పాటుచేసిన బోర్డు స్పష్టంగా లేకపోవడంతో సరిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులను దేవస్థానం అన్నదానంలో రుచి, శుచి ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. భక్తుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, సూపరెంటెండెంట్‌లు మూర్తి, ఐవీ రామారావు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ

జేఎన్టీయూకే, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యావిభాగం కార్యదర్శి కోన శశిధర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో ముగ్గురు విద్యావేత్తల పేర్లు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున నామినీగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వపు వీసీ ప్రొఫెసర్ కె.నిరుపరాణిని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తరుపున నామినీగా జేఎన్టీయూహెచ్ పూర్వపు వీసీ ప్రొఫెసర్ డీఎన్ రెడ్డిని, యూజీసీ నామినీగా మద్రాస్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీజీహినాధన్‌కామకోటిని నియమించారు. ఈ నామినీలు జేఎన్టీయూకే ఉపకులపతి పదవి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు పేర్లను గవర్నర్‌కు పంపుతారు. జేఎన్టీయూకే ఉపకులపతిగా వాటిలోని ఒకరి పేరును గవర్నర్ ఖరారుచేస్తారు. అయితే వీసీ పదవి కోసం జేఎన్టీయూకే నుంచి సుమారు 20 మంది వరకూ ప్రొఫెసర్లు దరఖాస్తు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా కేవీఎస్‌జీ మురళీకృష్ణ కొనసాగుతున్నారు.

వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభం

కాకినాడ సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్ పులవర్తివారివీధిలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రత్యేక అతిథిగా కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) విచ్చేశారు. కాకినాడ షోరూమ్ భాయజమాని పాబోలు బాబూరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, తుసి షోరూమ్ భాయజమాని గ్రంధి నారాయణరావు(బాబ్జి) పాల్గొన్నారు. సంఘ సేవకుడు సోము దుర్గాప్రసాద్ మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన కాకినాడలో తమ షోరూమ్‌ను ఎప్పటి నుంచో ప్రారంభించాలనుకున్నామని, ఇప్పుడు పండుగ మాసంలో కుదరరడం చాలా సంతోషంగా ఉందన్నారు. వినూత్నమైన కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్నిరకాల 22 కేటీ బంగారు ఆభరణాలను ఫ్లాట్ 6శాతం తరుగుకే పొందవచ్చన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరి లేదన్నారు. జీఎస్టీని కూడా కొనుగోలుదారుల తరపున తామే చెల్లిస్తామన్నారు. అదనంగా వెండి వస్తువుల కొనుగోలుపై కిలోకి రూ.10వేల తగ్గింపు ఉంటుందని, ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్ రాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్ రాజులతో పాటు పి.వెంకట నాగసూర్య పున్నయ్య, పి.వెంకట సింహాచలం, గుల్లపూడి నందు, పేకేటి ఈశ్వర్లు కాకినాడ నగర మాజీ మేయర్ సుంకర పావని తిరుమలకుమార్, కౌడా మాజీ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణకుమార్, నగరనాయకుడు నున్న దొరబాబు పాల్గొన్నారు.



షోరూమ్‌ను ప్రారంభించిన ఎంపీ ఉదయ్

పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

కరప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కరప ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణల చేతుల మీదుగా పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరిగినట్టు సంఘ మండలాధ్యక్షుడు పాట్నీడి నాగేశ్వరరావు తెలిపారు. సీపీఎస్ జిల్లా కన్వీనర్ వాకాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో రికవరీకి ప్రత్యేక బృందాలు

● పిఠాపురానికి అదనంగా ఎస్ఐని నియమిస్తాం ● జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్

పిఠాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో అపహరణకు గురైన సొత్తు రికవరీతో పాటు బాధ్యులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ వెల్లడించారు. ఆయన పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన రికార్డులు, కేసుల పురోగతి, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు తదితర అంశాలను పరిశీలించారు. చోరీ సంఘటనల్లో అన్‌డిటెక్టెడ్ కేసులు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. వీటిని చేధించి చోరికి గురైన సొత్తు రికవరీకి చర్యలు తీసుకోవాలని, సీఐ, ఎస్ఐల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా విచారణ దశలో 160 కేసులు ఉండిపోవడంపై ఎస్పీ అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటి విచారణలను నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణ, దొంగతనాలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామని ఎస్పీ తెలిపారు. జాతీయరహదారి, బైపాస్‌రోడ్డుకు చేర్పి గ్రామాలు నుంచి వచ్చే రోడ్లపై స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు, అంధకారంలో ఉన్న సెంటర్ల వద్ద లైట్లు ఏర్పాటుపై ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడతామని చెప్పారు. పిఠాపురం బైపాస్‌రోడ్డులో వాహనదారులు అపోజిట్ డైరెక్షన్‌లో వస్తున్నట్లు గుర్తించామని, దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. పిఠాపురంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని.. అదే విధంగా పాదగయ, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంతో పాటు ఆలయాలకు భక్తులు అధికంగా వస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో ఎస్ఐని, సిబ్బందిని నియమిస్తామని వివరించారు. స్థానికులు, వ్యాపార సంస్థల సహకారంతో ముఖ్యకూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.



పిఠాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

జూదాలు జరగకుండా చర్యలు

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాటలు, గ్యాంబ్లింగ్, జూదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్పీ చెప్పారు. పాత నేరస్తులను గుర్తించి ఇప్పటికే బైండోవర్ చేశామని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు, క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. సంక్రాంతిని కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని కోరారు. తనిఖీల్లో పిఠాపుకం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నగేష్

యూటీఎఫ్ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభల్లో యూటీఎఫ్ కాకినాడ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.నగేష్ ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడులను సంరక్షించుకునేందుకు పోరాటాలు చేస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరంకృషి చేస్తామన్నారు.

ఆన్ జాబ్ ట్రెయినింగ్

పిఠాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ వొకేషనల్ ఎం అండ్ ఏటీ విద్యార్థులకు నిర్వహించిన ఆన్ జాబ్ ట్రెయినింగ్ బుధవారంతో ముగిసింది.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

కాకినాడ కమిషనర్ భావన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 8(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించద్దని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన పారిశుధ్య సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం కమిషనర్ మూడో సర్కిల్‌లోని ఏడు, 8డివిజన్లలో పర్యటించి అక్కడి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల రోడ్డులో చెత్త సేకరణ పనులు ఎలా జరుగుతున్నదీ ఆరా తీశారు. చెత్త సేకరణకు వెహికల్స్ ఆలస్యంగా రావడాన్ని గమనించిన కమిషనర్ ఆ సిబ్బందిని ప్రశ్నించారు. సకాలంలో విధులు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లున్నారు.

గృహ నిర్మాణ ప్రగతిపై పీడీ సమీక్ష

పెద్దాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ ప్రగతిపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ వార్డ్ ఎమినిటీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, వెలుగు సిబ్బందితో హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ ప్రగతిపై ఆరాతీశారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి త్వరితిగతిన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న ఐదేళ్లలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మించేందుకు పీఎంఏవై 2.0 అమలుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం పలు విషయాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈఈలు కేవీఆర్ గుప్త, శ్రీనివాస్, డీఈ సువర్ణరాజు, సామర్లకోట ఎంపీడీవో కరక హిమమహేశ్వరి, ఏఈలు శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

కౌలు రైతులకు రుణాలు అందించాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

పిఠాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దాళ్వా సాగు చేసే రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ సూచించారు. ఆయన బుధవారం సాయంత్రం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పిఠాపురం బ్రాంచి అధికారులను కలిశారు. కౌలురైతులకు రుణసదుపాయం కల్పనపై చర్చించారు. 10వ తేది వరకూ రుణాలు తీసుకున్న రైతులకు పంటల బీమా ప్రీమియం చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ పథకం ద్వారా కేంద్రప్రభుత్వం 4శాతం, రాష్ట్రప్రభుత్వం 3శాతం వడ్డీని తిరిగి రైతుల ఖాతాల్లోనే జమచేయడం జరుగుతుందని చెప్పారు. అర్హులైన రైతుల జాబితాలను ఈనెల 20వ తేదీలోగా తమ పోర్టల్స్‌లో బ్యాంకు మేనేజర్లు అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. దుర్గాడ అచ్చారావు అనే కౌలురైతుకు జిల్లా వ్యవసాయాధికారి ద్వారా రుణ సదుపాయం కల్పించారు. ఆయన వెంట వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, ఏవో అచ్యుతరావు తదితరులు ఉన్నారు.



పిఠాపురంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న విజయకుమార్

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



దుర్గాడలో మామిడిపూతను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖాధికారి శైలజ

గొల్లప్రోలు రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మామిడిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని ఉద్యానవన శాఖాధికారి కెశైలజ సూచించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో బుధవారం మామిడి రైతులకు బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మామిడితోటల పిందె, పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పూత ఆశించిన రీతిలో రాకుంటే ఈనెల 20లోగా ప్లానోఫిక్స్ 2.50మి.లీలను 10లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పూత, పిందె దశలో పొటాషియం నైట్రేట్ 10గ్రాములను, బోరాన్ 2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా ఆడపూలు, పిందె శాతాన్ని పెంచుకోవచ్చునని వివరించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు. రైతులతో మామిడి తోటలను పరిశీలించారు.

19న గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ

సర్పవరం జంక్షన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19న తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ జయప్రదం చేయాలని గిరజన ప్రజా సమాఖ్య, ఐక్యవేదిక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ మధుకుమార్ కోరారు. బుధవారం తిమ్మాపురం అక్నూఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ కమలకుమారితో కలసి పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సభకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్రావు, కేరళ ఐజీ లక్ష్మణ్ నాయక్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. అధ్యాపకులు మహ్మద్ నదీమ్, డాక్టర్ స్టీఫెన్, డాక్టర్ గోపీ,మనోజ్ దేవా తదితరులు ఉన్నారు.



గిరిజన సమ్మేళన పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మధుకుమార్, ప్రిన్సిపాల్ కమలకుమారి

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి



గంగరాజు (ఫైల్)

పిఠాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చేట్ల గంగరాజు బుధవారం మరణించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మరణించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గంగరాజు మృతికి కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు, పీసీసీ కార్యదర్శి మేడిది శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలియజేశారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మృతికి సంతాపం

పెద్దాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బచ్చు శ్రీదేవి మృతికి కాంగ్రెస్ నేతలు బుధవారం సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సంతాపం తెలియచేసిన వారిలో మాజీ కేంద్ర మంత్రి ఎంఎం. పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్యే పంతం గాంధీ మోహన్, మల్లిపూడి రాంబాబు, మాదేపల్లి సత్యనందరావు, తుమ్మల దొరబాబు, తోట కరుణాకర్, చిలకపాటి సుదర్శన్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కరప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): యండమూరులో బుధవారం ఉచిత వైద్య, కంటి వైద్య శిబిలను నిర్వహించారు. రాజమహేంద్రవరం స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు తన తల్లిదండ్రులు, మావయ్య సొంబత్తుల వెంకట్రావుల జ్ఞాపకార్థం శిబిరం ఏర్పాటు చేయగా దాదాపు 300మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. 75మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించి, వారికి ఈనెల 19న అందజేస్తామని రాంబాబు తెలిపారు. సర్పంచ్ మారెళ్ల శివ, విశ్రాంత ఉద్యోగులు డాక్టర్ ఎంవీ ఆర్ మూర్తి, పి.చంద్రరావు, పీఎంపీ జిల్లా సంఘం అధ్యక్షుడు బల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

ముగ్గుల పోటీలు

కాకినాడ క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంప్రదాయ ముగ్గుల పోటీలను, క్రీడలను ఆడుతూ సమాజంలో తెలుగు సంస్కృతి ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావ్ అన్నారు. కాకి నాడ జగన్నాథపురం ఏఎస్‌డబ్ల్యు ఉమెన్స్ కళాశాలలో బుధవారం జరిగిన ముగ్గుల పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్, లెక్చరర్‌లు, వన్‌టౌన్ సిబ్బంది ఉన్నారు.



సంప్రదాయ మత్స్యకారులకు అలివి వేట జీవనోపాధి

● అరకొర పాటుతో కుటుంబాలను నెట్టుకొస్తున్న వైనం

కొత్తపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాలకు చెందిన సంప్రదాయ మత్స్యకారులు అలివి (వల) వేటే జీవనోపాధిగా కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందిన సంప్రదాయ మత్స్యకారులు ఇటీవల కాలంలో సముద్రంలో సరైన పాటు (వేట) లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరు ఒడ్డు నుంచి సుమారు ఆరు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో మాత్రమే చేపల వేట చేస్తారు. బోటుపై ఆరుగురు మత్స్యకారులు సముద్రం ఒడ్డు నుంచి తెల్లవారుజామున 6 కిలోమీటర్ల మేర చుట్టూ (రౌండ్) అలివి వల వేసుకుంటూ ఒడ్డుకు చేరుకుంటారు. ఒడ్డుకు చేరుకున్న అనంతరం సముద్రంలో వేసిన అలివి (వల)ని తిరిగి ఒడ్డుకు లాగేందుకు 30మంది మత్స్యకారులు శ్రమిస్తారు. ఇలా తెల్లవారుజామున సముద్రంలో వేసిన అలివి మధ్యాహ్నం 12- 1 గంటల మధ్య ఒడ్డుకు చేరుస్తారు. అనంతరం అలివి (వల)కి చిక్కిన చేపలను వేరు చేసి చిక్కాలతో అమ్మకానికి సిద్ధం చేస్తారు. అలివి వేట చేయడం ద్వారా మత్స్యకారులు ఆశించిన మేరకు చేపలు దొరికినట్లయితే ఆ రోజు అందరికీ రూ.2వేలు లేదా రూ.3 వేలు వస్తాయని మత్స్యకారులు చెబుతున్నారు. ఒక్కొక్క సారి అలివికి కనీసం రూ.పది వేలు విలువైన చేపలు దొరకని పరిస్థితిలో కనీసం రోజు కూలీ కూడా గిట్టుబాటు కాదని వాపోతున్నారు. తీరప్రాంతాల వెంబడి ఏర్పాటుచేసిన రసాయన పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థ రసాయనాలతో మత్స్యసంపద అంతరించిపోతుందని మత్స్యకారులు వాపోతున్నారు. కేవలం అలివి వేటే ప్రధానంగా జీవనం సాగిస్తున్న తీర ప్రాంత మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఉప్పాడ తీరంలో అలివి వేట చేస్తున్న మత్స్యకారులు

గొల్లప్రోలులో సొసైటీ ఉద్యోగుల ఆందోళన



గొల్లప్రోలు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు పట్టణంలోని విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ) ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన నిర్వహించారు. 2019 మార్చి 1న జారీ చేసిన జీవో 36ను అమలు చేయాలని, ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ వర్తింప చేయాలని, ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 62ఏళ్లకు పెంచాలని, వేతన సవరణ చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, గ్రాట్యుటీ ఇతర సౌకర్యాలు వర్తింప చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో గొల్లప్రోలు సొసైటీ కార్యదర్శి సూరిబాబు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సంప్రదాయ ఆటలే ముద్దు

తాళ్లరేవు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోడి పందాలు వద్దు సంప్రదాయ ఆటలే ముద్దంటూ, సంక్రాంతికి ఎటువంటి జూదాలు, కోడి పందాలు ఆడకుండా సంప్రదాయక ఆటలే ఆడాలని కాకికాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ అన్నారు. బుధవారం తాళ్లరేవు హైస్కూల్ గ్రౌండ్‌లో కోరింగ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో సంప్రదాయక ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గులు, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు కాకినాడ రూరల్ సీఐ బహుతులు అందించారు.

వేట్లపాలెంలో అక్రమంగా శ్లాబ్ నిర్మాణ పనులు



ఆక్రమణదారుడికి నోటీసులు జారీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

సామర్లకోట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వేట్లపాలెం దళితచెరువులో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా ఇంటి నిర్మాణం పనుల్లో భాగంగా బుధవారం శ్లాబ్ నిర్మాణ పనులు కొనసాగించడంపై పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఆక్రమణదారులకు సైతం పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేశారు. వివరాలు పరిశీలిస్తే ఇంటి అక్రమ నిర్మాణం వివాదంలో గత నెల 15న రాత్రి రెండు కుటుంబాల మధ్య దాడులు జరిగి ముగ్గురు కత్తిపోట్లతో హత్యలకు గురికాగా, ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో నేటికీ చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఈహత్యలకు దారితీసిన రోజు నాటికి మూడు నెలల ముందు నుంచే ఆక్రమణల వ్యవహారం వివాదంగా మారడం, పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేయడమే కాకుండా గ్రామ పెద్దల్లో పలు దఫాలు చర్చలు జరిపిన విషయం విదితమే ఈనేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య దాడులు జరగడంతో కత్తిపోట్లకు గురై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు హతమయ్యారు. అప్పటి నుంచి గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు, ఉన్నతాధికారులు సందర్శనలు జరిగినా బుధవారం ఆక్రమణదారులు గత నెల 15న నిలిపి వేసిన శ్లాబ్ నిర్మాణ పనులు తిరిగి పూర్తి చేయడంతో అధికారులు అవాక్కయ్యారు.

ఆలిండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో ఎన్నిక



రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ నూతన కార్యవర్గం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆలిండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రైల్వే కల్యాణ మండపంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా ఏఐ ఆర్ఆర్‌ఈడబ్ల్యుఎఫ్ జనరల్ సెక్రటరీ జీఎన్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముది రాజ్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యలు, వేతనాలు వంటి సమస్యలపై కృషిచేస్తామన్నారు. అనంతరం అధ్యక్షుడిగా వీఎస్ఎస్ మూర్తి, కార్యదర్శిగా బీవీ రమణ, ట్రెజరర్ టి.రఘురామ్, ఉపాధ్యక్షులుగా ఎస్ఎం జిలానీ, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.రహమతుల్లా, జి.రామభద్రం, సహాయ కార్యదర్శులుగా టీయు ఎస్ఎస్ నారాయణ, డి.శ్రీనివాసరావు, ఎస్.వెంకటరావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమం కేవీ రమణారావు, ఎన్‌వీ రమణారావు చీఫ్ అడ్వైజర్ల ఆధ్వర్యంలో జరిగింది.

జాతీయస్థాయి పోటీలకు ఆదిత్య విద్యార్థిని ఎంపిక

కాకినాడ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్, ఏఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్. అనుభార్గవి వికిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్-2025 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ,పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 10,11,12 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. పోటీల చివరి రోజు ప్రధానమంత్రి మోదీ సమక్షంలో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించనున్నారన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అనుభార్గవిని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి సుగుణ, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు తేజేశ్వరరావు, గౌరీ ప్రియ అభినందించారు.

తాళ్లరేవులో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు



బిషప్ వసంతరావును సత్కరిస్తున్న పాస్టర్లు

తాళ్లరేవు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు, యానాం పాస్టర్ల ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అధ్యక్షతన ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు బుధవారం జరిగాయి. బిషప్ దొమ్మేటి వసంతరావు జన్మదినం సందర్భంగా పాస్టర్లు ఆయనను ఘనంగా సత్కరించారు. దళిత క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషిచేయాలని పలువురు పాస్టర్లు డిమాండ్ చేశారు. యానాం, తాళ్లరేవుకు చెందిన పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

కాకినాడరూరల్, జనవరి8(ఆంధ్రజ్యోతి): విద్యార్థునుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ముగ్గులు పోటీలు దోహదం చేస్తాయని కాకినాడ వీబీవీఆర్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎండోమెంట్స్ కాలనీ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించాల్సిందే



ఆక్రమణలు తొలగించాక మున్సిపల్ డ్రైన్ బహిర్గతం

సామర్లకోట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏచిన్న పాటి వర్షం కురిసినా సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాలకు నీటముంపు బెడద తప్పడంలేదు. దీనిని నివారించేందుకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక కృషి మేరకు రూ.36లక్షల నిధులు విడుదల చేయించారు. దీంతో కొన్నిరోజులుగా మురుగు కాల్వలో పూడికత తీత పనులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రతీ ప్రధాన కాల్వలపై ఆయా ప్రాం తాల్లో ఉన్న ఇంటి యజమానులు డ్రైన్ల స్థలా లను ఆక్రమించి స్లాబ్‌రాళ్లు ఏర్పాటుచేసుకు న్నారు. దీంతో మున్సిపల్ పారి శుధ్య సిబ్బందికి పూడిక తీత పనులకు సమ స్యలు ఏర్పడుతున్నాయి. ఇలా రెండున్నర దశాబ్దాలుగా కాల్వల్లో పూడిక తీత పనులు నిర్వహించలేకపో తున్నారు. దీంతో కాల్వల్లో పూడిక పెరిగి వర్షం నీరు, మురుగునీరు ప్రవాహానికి అవకాశం లేక మురుగు నీరు రోడ్లపైకి వస్తుంది. దీంతో ఏ కొద్ది పాటి వర్షం కురిసినా పట్టణానికి ముంపు బెడద తప్పడంలేదు. పట్ట ణంలో ఆక్రమణ లను నిరోధించడంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రద్ధకనబర్చడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈనేపథ్యంలో రెండున్నర దశాబ్దాలుగా డ్రైన్‌పై ఉన్న ఆక్రమణలను ఎక్స్‌కవేటర్ సాయంతో మూడు రోజులు శ్రమించి తొలగిం చడంలో మున్సిపల్ అధికారులపై తీవ్ర వత్తిడి ఎదురైనట్లు సమాచారం. అయితే పలు ప్రాంతాల్లో డ్రైన్లపై ఆక్రవణలను తొలగించి మున్సిపల్, ఆర్‌అండ్‌బీ స్థలాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

సంప్రదాయ క్రీడలతో పండుగ జరుపుకోవాలి

సీఐ చైతన్యకృష్ణ



వాలీబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ చైతన్యకృష్ణ

కరప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): యువత కోడిపందేలు, జూదాలు జోలికి పోకుండా సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి పండుగను జరుపుకోవాలని కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు కరప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సంప్రదాయ క్రీడోత్సవాలు-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేత టీమ్‌ను అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఇంటర్ మహిళా విద్యార్థులకు రోడ్డుప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ టి.సునీత, ఏఎస్ఐ వి.సూరిబాబు పాల్గొన్నారు.

అస్పిరేషనల్ బ్లాక్ ఫెలో నియమానికి దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలంలో భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ పథకంలో అస్పిరేషనల్ బ్లాక్ ఫెలో నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దిష్ట వేతనం రూ.55వేలు ఉంటుందని, మూడు నెలలు తాత్కాలిక ప్రాతిపదికన పని చేయడానికి పోస్టు గ్రాడ్యుయేట్ చేసిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తులను రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 20న ఐటీడీఏ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఒకే ఒక్కడు!

ఎటపాక తహసీల్దారు కార్యాలయంలో పోస్టులన్నీ ఖాళీ

చాలా కాలంగా ముందుకు కదలని ఫైళ్లు.. పెండింగులో పనులు

ఉన్నతాధికారుల ఒత్తిడి... ఒంటిచేత్తో నెట్టుకొస్తున్న తహసీల్దారు సుబ్బారావు

ఎటపాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆ కార్యాలయంలో ఒకే ఒక్కరు.... అన్నీ తానై చూసుకుంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఎంత ఒత్తిడి ఉన్నా తట్టుకుంటూ పరిపాలనా పరంగా కార్యాలయంలో ఫైళ్లను శక్తిమేర ముందుకు నెట్టుకొస్తున్నారు. ఆయనే ఎటపాక తహసీల్దారు కారం సుబ్బారావు. రెండు నెలలకు పైగా ఒకే ఒక్క డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దారు, కింది స్థాయి స్థాయి అధికారుల పోస్టులు భర్తీ కాకపోవడంతో వివిధ రకాల ఫైళ్లతో పాటు రెవెన్యూ సేవలు పెండింగులో పడిపోతున్నాయి. దాంతో వివిధ సేవల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.


ఫైళ్లను పరిశీలిస్తున్న తహసీల్దారు సుబ్బారావు

ఎటపాక తహసీల్దారు కార్యాలయంలో పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దారు, ఇన్‌చార్జి తహసీల్దారుగా పని చేసిన పృథ్వీ మూడు నెలల క్రితం అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరుకు బదిలీ అయ్యారు. దాంతో మూడు నెలలుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీనే చేయలేదు. సీనియర్ అసిస్టెంట్ పోస్టు నాలుగు నెలలుగా ఖాళీగా ఉంది. పోలవరం ప్రాజెక్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన బాపిరాజు ఏడాదిన్నర క్రితం ఇక్కడకు డిప్యూటేషన్‌పై ఆర్ఐగా వచ్చారు.

ఎటపాక తహసీల్దారుగా కారం సుబ్బారావు బాధ్యతలు స్వీకరించి దాదాపు రెండు నెలలు దాటుతోంది. మిగతా సిబ్బంది లేకపోవడంతో కార్యాలయంలో ఫైళ్లన్నీ పెండింగులో వున్నాయి. గత నెల 13 నుంచి మంగళవారం వరకు రెవెన్యూ సదస్సులు జరిగాయి. అందులో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అందుకు కింది స్థాయి అధికారుల అవసరం ఎంతగానో ఉంటుంది. విద్యార్థుల సర్టిఫికెట్లు, రెవెన్యూ సేవలు, ఏజెన్సీ సర్టిఫికెట్లు, కోర్టు కేసులు, ఇతరత్రా పెండింగులో ఉన్నాయి.

సీలేరు సీఈకి మంత్రి ఓఎస్డీ అభినందనలు

మోతుగూడెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశిత గడువు కంటే ముందే చేరుకున్నందుకు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకి విద్యుత్ శాఖ మంత్రి ఓఎస్డీ ఆవుల సాంబశివరావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక సందేశం పంపారు. దానిని చీఫ్ ఇంజనీర్ చదివి పవర్ ప్లాంట్ ఉద్యోగులకు వినిపించారు. ఇంజనీర్లు, ఓఅండ్ఎం స్టాఫ్, సివిల్ స్టాఫ్, ఒప్పంద కార్మికులకు వాసుదేవరావు కృతజ్ఞతలు తెలిపారు.


సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఇంజనీర్లు, సిబ్బంది

ఇందుకూరులో వాలీబాల్ టోర్నమెంటు ప్రారంభం

దేవీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇందుకూరులో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంటును డిప్యూటీ తహసీల్దారు పి.జనార్దనరావు, ఎంపీటీసీ తుర్రం జగదీష్‌దొర బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ కోసు లక్ష్మణ్ హెడ్ అండ్ టాస్ వేసినట్టు ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు తెలిపారు. సిద్దబత్తుల భాస్కరరావు జ్ఞాపకార్థం మొదటి బహుమతి రూ.10వేలు, సిద్దబత్తుల శశిరేఖ జ్ఞాపకార్థం ద్వితీయ బహుమతి రూ.5వేలు, గొడ్డలి సత్యనారాయణ తృతీయ బహుమతి రూ.3వేలు, సింబోతుల నాగకుమారి, దూసరి బాబూరావు జ్ఞాపకార్థం షీల్డులు, బహుమతులను ఈనెల 13న అందజేస్తామన్నారు. ఆర్గనైజర్ ఎస్.రవి,


వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న డిప్యూటీ తహసీల్దారు, ఎంపీటీసీ

జగన్, బండారు వీరబాబు, సింబోతుల దుర్గాప్రసాద్, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, కారం రామన్నదొర, డి.హరిబాబు, కె.శ్రీధర్, సీహెచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

'అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలి'

చింతూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మీకోసం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదేశించారు. బుధవారం నిర్వహించిన మీకోసంలో చింతూరు డివిజన్ పరిధిలో 36 అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించిన పీవో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. కొన్ని అర్జీల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. పోలవరం సమస్యలపై వచ్చిన అర్జీలపై స్పందించారు. చింతూరు డివిజనుకు


అర్జీదారులతో మాట్లాడుతున్న పీవో భరత్

ప్రభుత్వం కొత్తగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమించిందని, వారు పండుగ తర్వాత విధుల్లో చేరే అవకాశం ఉందన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు

వై.రామవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవిటిదిబ్బలు పంచాయతీ తోటకూరపాలెం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేసి విద్యార్థులతో రంగవల్లులు వేయించి, గొబ్బెమ్మలు పెట్టించారు. పిండి వంటలు తయారు చేశారు. కోలాటం, నృత్య ప్రదర్శనలతో అలరించారు. ప్రిన్సిపాల్ లక్ష్మి,


భోగి మంట వద్ద విద్యార్థుల సందడి

ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కార్పెట్లు పంపిణీ

రంపచోడవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత దృష్ట్యా మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కార్పెట్లను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం బుధవారం సబ్ కలెక్టరు కేఆర్ కల్పశ్రీతో కలిసి అందజేశారు. ఎంఈవోలు ముత్యాలరావు, వై.వెంకటరమణ, ఎంపీడీవో కె.బాపన్నదొర, డీఈఈ నాగరాజు, ఐడీఎఫ్‌సీ బ్యాంకు మేనేజరు ఎస్‌సీఎస్ఎన్ మూర్తి, ఎ.ఖాజా,


కార్పెట్లు అందజేస్తున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్

అఖిల్‌రెడ్డి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సుబ్రహ్మణేశ్వర స్వామి విగ్రహం అపహరణ

వీఆర్ పురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రేఖపల్లి గ్రామంలోని కోటమైసమ్మ ఆలయం ఆవరణలో సుబ్రహ్మణేశ్వర స్వామి విగ్రహం మంగళవారం అపహరణకు గురైంది. ఇదే ఆలయంలో గత నెలలో నాగబంధం విగ్రహాన్ని చోరీ చేశారు. వరుస దొంగతనాలపై దృష్టి సారించాలని విశ్వహిందూ పరిషత్, సేవా ఫౌండేషన్ సభ్యులు కోరారు.

శ్రీరామగిరిలో నేడు తెప్పోత్సవం

వీఆర్ పురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరామగిరిలో గురువారం జరగబోయే తెప్పోత్సవానికి శ్రీసుందర సీతారామచంద్ర స్వామి ఆలయం ముస్తాబైంది. సాయంత్రం ఐదు గంటలకు గోదావరిలో తెప్పోత్సవం ప్రారంభమవుతుందని ఉత్సవ కమిటీ సభ్యుడు పెందుర్తి సుదర్శన్ తెలిపారు. భక్తులు తిలకించేందుకు నది ఒడ్డున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించే గ్రామీణ సంప్రదాయ క్రీడా పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు మాట్లాడుతూ యువత జూదాల జోలికి వెళ్లకుండా సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లతో సంక్రాంతి పండుగ రోజులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ యువత సంక్రాంతి క్రీడా పోటీల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, మీసాల రాజు, యాళ్ళ జగదీష్, బద్ది రామారావు, వెన్నా శివ, అమరాది వెంకట్రావు, ఇళ్ళ అప్పారావు, దాట్ల అప్పన్నబాబు, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పీఈటీ దేవికుమారి తదితరులు పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ


కొండబాబును సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

కొండబాబుకు సత్కారం

జగ్గంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేసిన కొత్త కొండబాబును బుధవారం మల్లేపల్లి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గ్రంధినాగ సుబ్రహ్మణ్యం, గండేపల్లి మండల ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్తశివయ్య సారథ్యంలో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంధి నాగబాబు, వరద శ్రీనివాస్, కాపగంటి మురళి, గుల్లపూడి సాయి, కొత్త చిన్నారి, బత్తుల నాని, చెక్క గంగరాజు, కొత్త సుబ్రహ్మణ్యం, మల్లేపల్లి ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న చైర్మన్ కృష్ణారావు, పలువురు ప్రొఫెసర్లు

ప్రగతి కళాశాలలో స్ట్రైడ్స్ సదస్సు

గండేపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం స్ట్రైడ్స్-2025 సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ జి.ఏసురత్నం, డాక్టర్ యూవీ రత్నకుమారి, డాక్టర్ ఏఎస్ఎన్ చక్రవర్తి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి టెక్నికల్ ఈవెంట్లలో భాగంగా వివిధ కల్చరల్స్ కూడా నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్, ఏఐ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రాధాకృష్ణ, డైరెక్టర్ (మేనేజ్‌మెంట్) ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ (అకడమిక్) డాక్టర్ కె.సత్యనారాయణ, స్ట్రైడ్స్-2025 కన్వీనర్ డాక్టర్ ఎ.రాధాకృష్ణ, డీన్ (ఆర్ అండ్‌డీ) డాక్టర్ పి.మాచిరాజు, డీన్ (కెరీర్ డెవలప్‌మెంట్ సెల్) డాక్టర్ ఎం.రాధికామణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వై.జయబాబు తదితరులు పాల్గొన్నారు.


పంచ హారతులు ఇస్తున్న భక్తులు, అర్చకస్వాములు

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పంచ హారతులు

తుని రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఎస్.అన్నవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి భక్తులు స్వయంగా పంచ హారతులు ఇచ్చే అవకాశాన్ని అర్చకులు కల్పించారు. బుధవారం అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొని స్వామివారికి హారతులు ఇచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రత్తిపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 11 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.11.46 లక్షలను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా బుధవారం అందజేశారు. టీడీపీ నాయకులు కన్నబాబు, అమరాది వెంకట్రావు, యాళ్ల విశ్వేశ్వరరావు, గోవిందనాయుడు, ఇళ్ల అప్పారావు, పంచాది వీరబాబు, మిరియాల శ్రీను, పోలిశెట్టి శ్రీను, జువ్విన తిరుపతిరావు, సూది బూరయ్య పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ


సమావేశంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

'చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

అడ్డతీగల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అడ్డతీగల విచ్చేసిన ఆయన స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడిగా అడ్డతీగలకు చెందిన సీనియర్ నాయకుడు దంగేటి సత్తి బాబును నియమించారు. బీసీ నాయకులు వంకా రాము, కట్టా ప్రసాద్, చొల్లం రాంబాబు, దొంగ నారాయణ, దంగేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు రంపచోడవరంలో

ప్రత్యేక కౌంటర్

పాడేరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెడికల్ కాలేజీలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేస్తున్న అభ్యర్థుల సౌకర్యార్థం రంపచోడవరంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హేమలత బుధవారం విలేకరులకు తెలిపారు. అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు డివిజన్ల నుంచి అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించేందుకు జిల్లా కేంద్రం పాడేరు వచ్చేందుకు ఇబ్బందిపడుతున్నారన్నారు. దీంతో రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలనే కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలతో ఈ చర్యలు చేపట్టామన్నారు. రంపచోడవరం, చింతూరు ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించవచ్చని ఆమె చెప్పారు.

'వలస ఆదివాసీ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయాలి'

చింతూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వలస ఆదివాసీ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయాలని గిరిజన సంఘం నాయకుడు సీసం సురేష్ కోరారు. బుధవారం చింతూరు డివిజన్ పరిధిలోని 21 గ్రామాలకు చెందిన వలస ఆదివాసీ పెద్దలు గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ని కలిశారు. తమ గ్రామాలకు విద్యుత్ సరఫరా కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు పొడియం లక్ష్మణ్, సోడె లెనిన్, కూర భీమయ్య, రవ్వ జోగారావు పాల్గొన్నారు.

'రాతపూర్వక హామీలు అమలు చేయాలి'

రంపచోడవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేస్తామని, సొంత బొగ్గు గనులు కేటాయిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన రాతపూర్వక హామీలను అమలు పర్చాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. బుధవారం న్యూడెమొక్రసీ పార్టీ కార్యాలయంలో ఆయన ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఐవీ రమణ, బాలురెడ్డి, లచ్చన్నదొర, ప్రసాద్‌దొర పాల్గొన్నారు.

రాజవరం మాజీ సర్పంచ్ నాగరాజు మృతి

రౌతులపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజవరం మాజీ సర్పంచ్ పిట్ల నాగరాజు (78) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన 2001 నుంచి 2005 వరకు సర్పంచ్‌గా వ్యవహరించారు. నాగరాజు మృతికి టీడీపీ మండల నేతలు సంతాపం తెలిపారు.


లక్ష్మీప్రసాద్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

సత్యదేవుని సన్నిధిలో

లక్ష్మీప్రసాద్

అన్నవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు, హిందీ అకాడమీ పూర్వ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ బుధవారం సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో సుబ్బారావు స్వామివారి ప్రసాదం అందించారు. దేవస్థానం పూర్వ ట్రస్టీ కరుటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.


పరిశ్రమ ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

54వ రోజుకు కార్మికుల నిరసన

ఏలేశ్వరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నింపేటలో జీడిపిక్కల పరిశ్రమ కార్మికుల నిరసన బుధవారం 54వ రోజుకు చేరుకుంది. ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డా అధికారులు, యాజమాన్యం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి 409 మంది కార్మికులకు తగిన న్యాయం చేకూర్చాలన్నారు.

డిగ్రీ కళాశాలలో రేపు మినీ జాబ్ మేళా

జగ్గంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనా అధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ చిన్నారావు తెలిపారు. ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, డెక్కన్‌ఫైన్ కెమికల్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన 19-35 ఏళ్లలోపు యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూకు ధర్మ పరిషత్ కృతజ్ఞతలు

జగ్గంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాక శివకేశవులు ఆలయం వద్ద జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూను భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలో ఈనెల 5న జరిగిన హైందవ శంఖారావానికి బయల్దేరిన వారికి మురారిలో ఉదయం అల్పాహారం ఏర్పాటు చేయడమే కాకుండా తిరిగి వచ్చే దారిలో పులిహోర, వాటర్ ప్యాకెట్లు ఇచ్చి క్షేమంగా వచ్చేలా చూసినందుకు ధన్యవాదాలు తెలిపారు. భారతీయ ధర్మ పరిషత్, వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నెహ్రూతో మాట్లాడుతున్న భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

సంప్రదాయ క్రీడోత్సవాల్లో 'భాష్యం' విద్యార్థుల ప్రతిభ

జగ్గంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో జరిగిన గ్రామీణ సంప్రదాయ క్రీడల్లో భాష్యం స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. త్రోబాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. వారికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణి, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ బహుమతులను ప్రదానం చేశారు. విజేతలకు భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు రవినాగ్ పాల్గొన్నారు.


సాధించిన బహుమతులతో విద్యార్థులు

పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

తొండంగి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో బుధవారం సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. కోకో కోలా కంపెనీ ప్రతినిధులు కె.సత్యనారాయణ, ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో ముగ్గులు, ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మెహర్ సంక్రాంతి విశిష్టతను వివరించారు. టి.రాము, జగదీష్, ప్రకాష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

సంక్రాంతికి ఊరెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ శివనాగబాబు



గండేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు బంధువుల ఇళ్లకు వెళ్లేవారు ఇళ్లల్లో బంగారు ఆభరణాలు, నగదు ఉంచవద్దని గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగలు బ్యాగుల్లో పెట్టుకోకుండా మెడలో ధరించాలన్నారు. లేదంటే లాకర్లలో భద్రంగా ఉంచుకోవాలన్నారు. పండుగల వేళ చోరీలు జరిగే ప్రమాదమున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఊరు వెళ్లేముందు చుట్టుపక్కల వారికి, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు.